విశాలాంధ్ర కృష్ణా జిల్లా

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - గుడివాడ : యోగాతో పరిపూర్ణ ఆరోగ్య వికాసాన్ని పొందటమే కాకుండా మేధోసంపత్తి పెరుగుతుందని యోగామిత్ర కె.డి.వి.ఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియం, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమందికి పైగా యోగాపై అవగాహన, శిక్షణ అందించి, అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సేవలు అమోఘం

విశాలాంధ్ర-పెడన : ప్రేమాంజలి సోషల్ సర్వీస్ సేవలు అమోఘమని ఆర్ఎంపీ డాక్టర్ గరికిముక్కు నాగరాజు అన్నారు. ప్రేమాంజలి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో చెంచుల కాలనీలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా 130 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అరుకులు మందులు పంపిణీ చేశారు. ప్రేమంజలి సోషల్ సర్వీస్ కోఆర్డినేటర్ సిస్టర్ హెలెన్ మాట్లాడుతూ పరిశుభ్రత గురించి పిల్లలకు వివరిస్తూ .ఈ కార్యక్రమంలో మరియు సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

కొడాలి నానిపై కేసు నమోదు

విశాలాంధ్ర - గుడివాడ : మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అయన అనుచరులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సమాచారం. నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ మాజీ వాలంటీర్ల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొడాలి నాని, అయన అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, గొర్ల శ్రీను, మరో ఇద్దరు వైపిపి నేతలపై కేసు ఐపీసీ సెక్షన్ 447, 506 కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

విద్యార్థులకు నోట్ బుక్స్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర - పమిడిముక్కల: శ్రీ ఆదిశంకరాచార్య వేదిక్ సేవా ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కూడేరు, ఐనపూరు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్ కిట్స్‌ను ట్రస్ట్ అధికారి పసుమర్తి ఆంజనేయ శాస్త్రి పంపిణీ చేశారు. శుక్రవారం సదరు ట్రస్ట్ కూడేరు, ఐనపూరు పాఠశాల లో చదువుతున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.8వేలు విలువ చేసే నోట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల తో పాటు ట్రస్ట్ ఏర్పాటు చేసిన పుస్తకాలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.ఎ.కె. స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయం

విశాలాంధ్ర - ఘంటసాల : బెస్ట్ సోషల్ సర్వీస్ మేనేజ్మెంట్ లైఫ్ ఫౌండేషన్ దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఘంటసాల ఎంపిడివో బి.మారుతి శేషమాంబ అన్నారు. ఘంటసాల మండలం, చిలకలపూడి గ్రామంలోని బెస్ట్ సోషల్ సర్వీస్ మేనేజ్మెంట్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75 మంది దివ్యాంగులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సు నిర్వహించారు. ఆయా కోర్సులు పూర్తి చేసిన దివ్యాంగులకు ఎంపిడివో మారుతి శేషమాంబ చేతులు మీదగా సర్టిఫికెట్లను శుక్రవారం ప్రధానం చేశారు. అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ దివ్యాంగులకు సమాజంలో ఓ గుర్తింపు తేవడంతో పాటు ఒకరి పై ఆధారపడకుండా నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి జీవనోపాధి మార్గాలు కల్పించడం బీఎస్ఎమ్ఎల్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, బెస్ట్ సోషల్ సర్వీస్ మేనేజ్మెంట్ లైఫ్ ఫౌండేషన్ ఛైర్మన్ పెనుమాక బాలు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

యూరాలజీ వైద్యసేవలు అభినందనీయం

విశాలాంధ్ర - గుడివాడ : ప్రజలకు మునుపెన్నడూ లేని విధంగా యూరాలజీ వైద్య సేవలను డాక్టర్ యలవర్తి పవన్‌గణేష్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమాని పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోకలే అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులో యూరాలజిస్ట్ జనరల్ సర్జన్ డాక్టర్ యలవర్తి పవన్‌గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ హాస్పిటల్‌ను పద్మశ్రీ డాక్టర్ గోకలే గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకటరావు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని బాబ్జీ, వైద్యులు మన్నెం భవానిశంకర్, సోమూరి వెంకట్రావు, వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యం, పాస్టర్ సజ్జా బర్నబాస్, గుడివాడ డి.ఎస్.పి శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

గంగానమ్మ ఆలయంలో టీడీపీ పూజలు

విశాలాంధ్ర-పెదపారుపూడి: మండలంలోని యలమర్రు గ్రామంలో కొలువుతీరిన గంగానమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఆ పార్టీ సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ, తదితర గంగానమ్మ భక్త బృందాలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం వేల సంఖ్యలో అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు వృధా చేయొద్దు

విశాలాంధ్ర, కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో "సేవ్ వాటర్"అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. నీటి చుక్కను వృధా చేయకుండా కాపాడుకోవాలని వారు సూచించారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి రోహిణి కార్తిక మించిన ఎండలు వేస్తూ వడగాలులు వీస్తుండటంతోతాగునీటికి అత్యంత ప్రాధాన్యత పెరుగుతోందని ఈ దశలో ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా ఆదా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ విషయాన్ని ఇంటి వద్ద తల్లిదండ్రులకు, స్నేహితులకే కాకుండా ప్రతి ఒక్కరికి వివరించి తెలియపరచాలని పాఠశాల ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ పిల్లలకు సూచించారు.

యోగాతో మానసిక ఉపశమనం: మంత్రి



విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: యోగాతో మానసిక ఉపశమనం లభిస్తుందని, శరీరాన్ని మనసును అనుసంధానం చేసే చక్కని ప్రక్రియ యోగా అని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన యోగ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి యోగాడే కార్యక్రమంలో మంత్రి పాల్గొని యోగాసనాలు ప్రాక్టీస్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యం కోసం మన పూర్వీకులు మనకు అందించిన ఒక గొప్ప వరం యోగ అన్నారు. మన జీవన విధానంలో యోగాను అలవర్చుకొని పాటిస్తే ఆరోగ్య సమస్యలతోపాటు మానసిక రుగ్మతలు తొలగించుకుని ఆరోగ్యవంతమైన జీవనవిధానం అలవడుతుందని అన్నారు. యోగ విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లడానికి యోగకేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు. 2014లో నరేంద్రమోడీ ఐక్యరాజ్య సమితిలో పెట్టి యోగాను ప్రపంచవ్యాప్తం చేశారని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఇది దోహదం చేసిందన్నారు. ప్రతిఒక్కరు జీవన విధానంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. యోగా దినోత్సవం మన వారసత్వ సంపద గొప్ప దనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే మహాసంకల్పం అన్నారు. కలెక్టర్ డీ.కే.బాలాజీ మాట్లాడుతూ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యోగ ఒక గొప్ప ఆరోగ్య సాధనం అని కోవిడ్ అనంతర పరిస్థితులు మన జీవన శైలిలో మార్పులు కారణంగా మన ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలికి యోగ దోహదం చేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రాచీనకాలం నుండే యోగా మన సంస్కృతిలో భాగం అన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యోగాను ఆరోగ్య సాధనంగా మలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ.కె.చంద్రశేఖర రావు, ఏఎస్పిలు జి. వెంకటేశ్వర రావు, ఎస్.వి.డి. ప్రసాద్, కెఆర్ఆర్సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ బి.కల్పనకటాక్షం, మున్సిపల్కమిషనర్ బాపిరాజు, డిఎస్.డి.ఓ.ఝాన్సీ, తహశీల్దారు తోట సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దివిసీమలో సంబరాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ నాల్గోవ పర్యాయం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కూటమి నేతలు దివిసీమలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం అమరావతిలో నియోజకవర్గ శాసనసభ్యునిగా మండలి బుద్ధప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో దివిసీమ వ్యాప్తంగా ఒకేసారి పెద్ద ఎత్తున టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు. అవనిగడ్డ మాజీ ఉపసర్పంచ్ అడపా శ్రీను ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్, డిఎస్పీ రోడ్డు సమీపంలో టపాసులను పేల్చి మిఠాయిలను పంచి సంబరాలు జరపడంతో కూటమి నేతలు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి తరలివచ్చి విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం 10 సంవత్సరాలుగా రాజధాని లేని రాష్ట్రంగా ఉందని, నేడు నాల్గోవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉపముఖ్యమంత్రిగా జనసేన పార్టీ అధినేత కొనిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధికి ఆస్కారం ఏర్పడిందని, వారి ఆశీసులతో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో అభివృద్ధిలో అవనిగడ్డ ముందుకు వెళ్తుందన్నారు. పేదలు, బడుగులు, రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని చట్టసభల్లో ప్రజలకు రాష్ట్ర భవిష్యత్తుకు మంచి చేకూరే నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, మాచవరపు ఆదినారాయణ, మైలా హరిబాబు, కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చ

విశాలాంధ్ర అవనిగడ్డ : శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌ను కోడూరు మాజీ జడ్.పి.టి.సి బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు సమస్యలపై కూటమి నేతలు చర్చించారు. శుక్రవారం మండలి బుద్ధప్రసాద్ ఈ పర్యాయం మొట్ట మొదటి సారిగా శాసనసభ్యులుగా ఎన్నికైన అనంతరం శాసన సభలో అడుగు పెడుతున్న సందర్భంగా శుక్రవారం మండలి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గోగినేని సోమశేఖర్‌రావు, పిండి మల్లిఖార్జునరావు, తోట రాంబాబు, ఉల్లి శేషగిరి, వేములపల్లి శ్రీ కృష్ణ, వేములపల్లి రాజేష్, జరుగు సుధాకర్, తుంగల రాజేష్, బచ్చు వెంకటేష్, రమణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

హైస్కూల్ హెచ్ఎం ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నెమ్మానిశేషసాయికుమార్ (59) శుక్రవారం వేకువ జామున విజయవాడ లోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఈనెల 19వతారీకు బుధవారం కూచిపూడి లోని నివాస గృహంలో అస్వస్థతకు గురవటంతో ఆయనను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు.చికిత్స పొందుతున్న సాయికుమార్ జామున 4 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన రక్తసంబంధీకులుకూచిపూడి లోని హైస్కూల్ సిబ్బందికి, గ్రామస్తులకు సమాచారం అందజేశారు. సాయికుమార్ గత ఏడాది మే నెలలో కూచిపూడి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందుగా 2022 లోమొవ్వ మండలంలోని చినముత్తేవి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. ఈయన హయాంలో చినముత్తేవి, కూచిపూడి హైస్కూళ్ళలో రెండు సంవత్సరాలుపదవతరగతిలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో గుర్తింపు తెచ్చుకొన్నారు. 2023.. 24 విద్యా సంవత్సరంలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గత నెలలో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహేరాసుల్తానా మచిలీపట్నంలోని పార్క్ స్కూల్లో శాలువాతో పుష్పగుచ్చంతో సత్కరించారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈయన మృతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అసెంబ్లీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. ఈయన భౌతికాయాన్నికృష్ణాజిల్లా పోరంకి లోని స్వగృహానికి తరలించి సాయంత్రానికి అంత్యక్రియలు నిర్వహించారు.

రేషన్ బియ్యం రీ సైకిలింగ్ చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - చల్లపల్లి: రేషన్ బియ్యం రీ సైకిలింగ్ జరిగితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి పార్వతి హెచ్చరించారు. శుక్రవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్వో మాట్లాడుతూ, రేషన్ సరఫరాపై గ్రామస్థాయి నుంచీ జిల్లా స్థాయి అధికారుల నిరంతర నిఘా వేస్తామన్నారు. డోర్ డెలివరీ ఆటోలో ఉన్న సరుకు, ఈ పోస్ యంత్రంలో ఉన్న సరుకు లెక్కలు సమానంగా ఉండాలనీ, ఏమాత్రం తేడా వచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్డుదారుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. రేషన్ డీలర్లపై, ఎండీయూ ఆపరేటర్లపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందిస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ బి. సుమతి, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, ఇన్చార్జి ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉపశమనం : న్యాయమూర్తి

విశాలాంధ్ర - బంటుమిల్లి : యోగాతో మానసిక ఉపశమనం కలుగుతుందని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణ నందు శుక్రవారం బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం భాస్కరరావు ఆధ్వర్యంలో యోగ గురువు వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం భాస్కరరావు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం మన పూర్వీకులు మనకు అందించిన ఒక గొప్ప వరం యోగ అని అన్నారు. మన జీవన విధానంలో యోగాను అలవర్చుకొని పాటిస్తే ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక రుగ్మతలు తొలగించుకుని ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని అన్నారు.యోగ విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లడానికి యోగ కేంద్రాలు ప్రయత్నాలుచేస్తున్నయన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి బార్ అసోసియేషన్ సభ్యులు,బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య జీవనం

విశాలాంధ్ర-పెదపారుపూడి: యోగాతో శారీరక మేలు అనేకం ఉన్నాయని అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారిణి నత్తస్ఫూర్తి శుక్రవారం అన్నారు. మండలంలోని మహేశ్వరపురం గ్రామంలో అమృత సరోవర్ చెరువు వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే వ్యక్తులతో యోగ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో స్ఫూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ, ప్రతిరోజు యోగా చేసి ఆరోగ్యంగా జీవించాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సుధాకర్ రెడ్డి, టి ఏ రంగారావు, బి ఎఫ్ టి అశోక్ కుమార్, ఎఫ్ ఎ బాజీ, మెట్లు, ఉపాధి హామీ పనివారు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటల విద్య అవసరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మూడు సంవత్సరాల నిండిన పిల్లలను అంగన్వాడీ లో చేర్పిస్తే ఆట పాటలతో కూడిన విద్య నేర్చుకుంటారని వైఎన్ యంపిపి కొడమంచిలి మహేష్ అన్నారు.శుక్రవారం హనుమంతపురం అంగన్వాడీ కేంద్రం లో గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని వారికి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తో ఆట పాటలతో పాటు పౌష్టికాహారం అందచేస్తున్నరాని , తల్లిదండ్రులు సదరు కేంద్రానికి వేళ్ళి మేనూని పరిశీలించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలపాల రాంబాబు, ఉపాధ్యాయులు వి.నిరంజన రావు,జె.భాగ్యవతి, పి.వెంకటేశ్వరమ్మ, కనకదుర్గ,అంజలి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం

విశాలాంధ్ర -పమిడిముక్కల: యోగాతో మానసిక ఉల్లాసం మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - పమిడిముక్కల ప్రధానోపాధ్యాయులు వి.వి.నారాయణ అన్నారు.శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాల లో యోగ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే యోగ లో శిక్షణ పొందితే రోగాల బారిన పడరని ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. పి.డి.ఇ.వి.నారాయణ విద్యార్థులు చే యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం: దుట్టా

విశాలాంధ్ర అవనిగడ్డ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎస్.వి.ఎల్ విద్యా సంస్థల డైరెక్టర్ దుట్టా ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎస్.వి.ఎల్ విద్యా సంస్థలలో విద్యార్థులతో యోగాసనాలు చేయించి మాట్లాడారు. భారతీయ సంస్కృతి జీవన విధానంలో అంతర్భాగం అయిన యోగాతో మానసిన ప్రశాంతతో పాటు ఆరోగ్యం కూడా బాగుండి సంజీవనిలా పని చేస్తుందన్నారు. పురాతన కాలం నుండి యోగాకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందని, ఆధునిక జీవన శైలితో ఎన్నో రకాల అనారోగ్య సమస్యల నుండి విముక్తి లభించడానికి యోగాని చాలా తేలికైన మార్గం అన్నారు. నిత్య యోగ సాధనతో అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని అన్నారు. చక్రాసనం వంటి యోగాసనాలతో మానవ శరీరంలోని ప్రతి అవయవాన్ని ఉత్తేజపరచడానికి ఉపయోగిం చే సాధనాలుగా మన పూర్వీకులు, ఋషులు పలు గ్రంథాల్లో పేర్కొన్నట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21 న యోగా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని, ప్రపంచ దేశాల్లో యోగా సాధన రోజు రోజుకి పెరుగుతున్న సమయంలో మన భారత ప్రధాని నరేంద్ర మోడీ 2014 లో యోగాను ప్రపంచ దినోత్సవంగా జూన్ 21న ప్రతిపాదనపై ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి నాగేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శారీరక మానసిక వికాసం యోగాతో సాధ్యం : అన్నవరపు

విశాలాంధ్ర-గన్నవరం: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గన్నవరం మండలం సావరిగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ అట్లా నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన యోగ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికుల నుద్దేశించి గన్నవరం మండలం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజా బెత్ రాణి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మంచి ఆరోగ్యం కోసం యోగా చేయవలసిన అవసరం ఉందని అన్నారు. శ్రీకృష్ణుడు, గౌతమ బుద్ధుడు, మహావీరుడు యోగాను ప్రోత్సహించారని, పిల్లలకు యోగా నేర్పించి భావితరాలకు అందించాలని, యావత్ ప్రపంచం యోగా వైపు చూడటం మంచి పరిణామం అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం ప్రాధాన్యత మాట్లాడుతూ యావత్ మానవాళికి భారతదేశం అందించిన మహోన్నత యోగాను ఐక్య రాజ్య సమితి గుర్తించటం, ప్రపంచ దేశాలు ప్రతి ఏటా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయం తీసుకోవటం గర్వకారణం అన్నారు. శారీరక మానసిక వికాసం అందించే యోగా భారతదేశంలో వేద కాలం నుంచి ఉందన్నారు. మహావీరుడు యోగాకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. కాలక్రమేణా ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని, ముఖ్యంగా నేటితరం పిల్లలకు యోగా నేర్పించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ అన్నవరపు చంద్ర శేకరరావు అక్కడ పాల్గొన్నా వారికి యోగా ఎలా చేయాలి అని కొన్ని చేసి చూపించారు.సావారిగూడెం గ్రాం ఉపాధి పిల్డ్ ఆశిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొని యోగా చేశారు.

డీజీపీకి జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ ద్వారకాతిరుమల ఐపీఎస్‌ను కృష్ణ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఐపీఎస్ మంగళగిరి డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అంద చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - గుడివాడ : ముఠా కార్మికు లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరీ ఎస్ వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో జిల్లా హమాలీల మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ముఠా కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌లతో పాటు భవన నిర్మణ కార్మికులు ఏర్పాటు చేసిన విధంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మచిలీపట్నంలో నిర్మిస్తున్న పోర్టులో ముఠా కార్మికులకు పని కల్పించాలన్నారు. భవన నిర్మిణ కార్మికులకు సంబంధించి సంక్షేమ బోర్డులో ఉన్న 40వేల పెడింగ్ క